## కూటికోసం కోటివేషాలు, అదే మోసాలు :

# సత్తెయ్య హోటలు

తురగా కృష్ణమోహన్‌రావు

బందరువాళ్లకి కోపంరాదంటే, ఒక విషయం చెప్పచ్చు. అక్కడి వాళ్లకి కొత్త హోటళ్లంటే కోపం. పాతవంటే ప్రాణం. కేషియరు ముసలాడైతే, కేరింతలు కొడుతూ వస్తారు జనం. సెర్వరుకి చెముడని తెలిస్తే, శేర్లకొద్దీ తాగుతారు కాఫీ. గల్లాపెట్టికి చిల్లుందంటే, కనకవర్షం కురిపిస్తారు. ఈసంగతి హోటలు వాళ్లకి కూడా తెలుసు. అందువల్ల కొత్తగా హోటలు స్థాపిద్దామని ఆలోచన వస్తే, ఐడియా పాతదై పోయే వరకూ ఆలోచిస్తూ కూచుంటారు. హోటలు కొత్తగా స్థాపించినా, అది పాతదిలా కనుపించేందుకు ప్రయత్నాలు చేస్తారు. సందులూ గొందులూ వెతుకుతారు మొదట స్థలం కోసం. అక్కడ ఈగలూ, దోమలూ ఉన్నాయో లేదో చూస్తారు. మురికి కాలవలు ఒకటో రెండో ముందునుంచి పారుతున్నాయో లేదో పరిశీలిస్తారు. పాండవోద్యోగ విజయాలో, గయోపాఖ్యానమో నాటకం వూళ్లో ఆడిన మర్నాడు — ఎవరికీ చెప్పకుండా ఇడ్లీ, దోసె తయారుచేసి ప్రారంభించేస్తారు. జనం తండోపతండాలుగా వచ్చి చేరి, పాండవులూ, కాఫీ తాగుతూ, ఇడ్లీ, దోసె తింటూ నాటకంలో పాత్రల్ని గురించి చర్చించుకుంటూ సుఖంగా కాలం గడుపుతారు.

పది పదిహేను సంవత్సరాల క్రితం వరకూ ఇదీ పరిస్థితి. 'కాఫీగృహమే కదా స్వర్గ సీమ?' అని జనాన్ని పాడుకొనేలా చేసే పరిస్థితి. ఈ పరిస్థితి హఠాత్తుగా ఓసారి మారిపోయింది.

పదహారణాల తెలుగాయనే ఒకాయన ఒక హోటల్ స్థాపించాడు. అప్పట్లో నయాపైసలు లేవుగా మరి? హోటలు కొత్త హోటలు. సరికొత్త రూపాయినోటులా రెపరెపలాడాయి అంటించిన రంగు కాగితాలు. మహాత్మా గాంధీ, అక్కినేని నాగేశ్వరరావు, పండిట్ నెహ్రూ, జమున, రాజేంద్రప్రసాద్, రేలంగి, వంటి నాయకుల ఫోటోలు గోడలనిండా తగిలించేశాడు. టిఫిను తినేసి డబ్బివ్వకుండా పారిపోయి వచ్చేద్దామనుకునే వాళ్లకుస్పష్టంగా కనిపించేటట్టు కళ్లెర్రచేస్తూన్న ఎస్వీరంగారావు ఫోటో పెట్టాడు. 'నగదు శ్రేష్ఠం అరువు బరువు', 'సత్యమేవ జయతే', 'కప్పులలో ప్లేట్లలో చేతులు కడుగరాదు', 'అహింసా పరమో ధర్మః' వంటి బోర్డులు చోటున్న చోటల్లా తగిలించాడు. ఖాళీ మిగిలిన చోటుల్లో అద్దాలు పేర్చేశాడు. రంగురంగుల దీపాలు ఏర్పాటు చేశాడు. మొదటిరోజున పెద్ద సభ జరిపి, అందరికీ టిఫెను మారికే పెట్టి, శానిటరీ ఇన్స్పెక్టర్‌కీ, పోలీసువాళ్లకీ మెడలో దండలువేసి, వూరేగించి, ఫోటోలు తీయించాడు.

ఇదంతా చాలదన్నట్టు — 'ఇచ్చటి పదార్థములన్నియూ వెన్నకాచిన నేతితో రుచికరముగను, పరిశుభ్రముగను తయారు చేయుబడును. వెన్నకాచిన నేయి కాదని రుజువు చేయువారికి నూరు రూపాయలు బహుమానం' అని పెద్ద బోర్డు కట్టాడు. పదార్థములు 'అన్నియూ' ఏమిటి నామొహం? కాఫీకూడా వెన్నకాచిన నేతో చేస్తాడా? లేకపోతే—కాఫీ పదార్థం కాదంటాడా!

మర్నాడు విద్యార్థులం అందరం కాలేజీ ఆవరణ వెలుపల ఒక సమావేశం జరిపి, 'ఆ హోటలు స్థాపించిన పెద్దమనిషి మెదడుమాత్రం పెద్దది కాదు' అని ఏకగ్రీవంగా తీర్మానించాం. దానికి కారణాలు ఉన్నాయి. ఒకటి: కాఫీ, టీ వంటివి వెన్నకాచిన నేతో చేస్తామనడం శుద్ధ పొరపాటు. రెండు: చేసినా, ఖర్చు తలకిమించినది ఔతుంది. మూడు: హోటలు, బందర్లో, కొత్తది స్థాపించడమే పొరపాటు. నాలుగు: గల్లాపెట్టికి చిల్లూ లేక, సెర్వర్లెవరికీ చెముడూ లేక, కేషియర్‌కి వయసూ లేక, కొత్త హోటలు కొత్త హోటల్లా స్థాపించడం పొరపాటు. ఇవన్నీ పైకి ఒప్పేసుకుని హోటలు స్థాపించడం ఐదో పొరపాటు.

ఈ హోటలు స్థాపన విషయంలో ఏదో మోసం ఉండి ఉండవచ్చునీ, అది బయటపెట్టి నూరు రూపాయల బహుమానం సాధించడం ప్రతి విద్యార్థి విధి అనీ, ఆ హోటలు విషయం పరిశీలించడానికి సుమారు పన్నెండు వందల ఏభై మంది విద్యార్థులలో ఒక ఉపసంఘాన్ని నియమించాలని కూడా తీర్మానించాం. ఆ ఉపసంఘంలో నేను కూడా సభ్యుణ్ణి.

పరిశీలన ప్రారంభించాం. ప్రతిరోజూ పన్నెండు వందల ఏభై మందిమి ఏదో వంక పెట్టుకొని ఏదో ఒకటి తిని వచ్చేవాళ్లం. తిన్నకొద్దీ తాగినకొద్దీ, పదార్థాలు వెన్నకాచిన నెయ్యి కాదనే అనుమానం ఎక్కువైంది. పరిశోధన తీవ్రతరం చేశాం. సెర్వర్లకి లంచాలిచ్చాం. స్టోర్‌కీపర్లని సినిమాలకి తీసుకెళ్లాం. సరుకులు ఎక్కడ తీసుకొస్తున్నారో ఆచోకీ తీశాం. దారిలో విఘాతం కలిగించాం. బిల్లులు పరిశీలించాం. పెద్దమనిషి అనుకున్న హోటలు ప్రొప్రయిటరు మోసం చేస్తున్నాడని రూఢి అయింది. 'ఎవరు పట్టుకొని, నూరు రూపాయల బహుమానం కొట్టేస్తారు?' అన్నది ప్రశ్న ఐంది. 'మధ్యప్రదేశ్ పోలీసులు మాన్సింగును పట్టుకుంటారా ముందు? లేక మావూరి విద్యార్థులు మాయదారి సత్తెయ్యని దారిలోకి తీసుకొస్తారా ముందు?' అన్నది మరో ప్రశ్న.

చివరికి నేనే వెళ్లాను. సాక్ష్యమంతా సేకరించుకుని, సత్తెయ్య ముందు నిలబడ్డాను. సాక్షుల్ని కూడా తీసుకెళ్లాను నాతో. 'ఇప్పుడు ఏమంటావ్?' అని గదమాయించాను. 'చిత్తం' అన్నాడు సత్తెయ్య. 'మీరు చెప్పింది నిజమేనండి. డాల్డాలో నూనెకలిపి వాడుతున్నానండి' అన్నాడు. 'మరలా ఎందుకు రాశావ్?' అన్నాను. 'అలా రాయకపోతే — ఈ కొత్త హోటల్‌కి ఎవరు వస్తారండి?' అన్నాడు. నేను వికటాట్టహాసం చేశాను. చేసి, 'నూరు రూపాయలు తే!' అన్నాను.

సత్తెయ్య అర్థంకానట్టుగా మొహంపెట్టాడు, 'ఏ నూరు రూపాయలండీ?' అన్నాడు. 'నువ్వు బహుమానం ఇస్తానని ప్రకటించిన నూరు రూపాయలు!' అన్నాను నేను. 'చిత్తం' అన్నాడు సత్తెయ్య. 'మీరు పొరబడ్డారండి' అన్నాడు. 'నేను పొరబడాల్సిందే' అన్నట్టు నవ్వేను. నా సాక్షులు కూడా నవ్వేరు. చోద్యం చూద్దామని చుట్టూ గుమికూడిన వాళ్లలో చాలమంది కూడా నవ్వేరు. 'మీరల్లా నవ్వితే నేను చెప్పలేనండి మరి. వెన్నకాచిన నెయ్యి కాదని రుజువుచేసిన వాళ్లకి నూరు రూపాయలిస్తానని అన్నానండి. వెన్నకాస్తే, నెయ్యి కాదని రుజువు చెయ్యాలండి. చేస్తే, తప్పకుండా ఇస్తానండి డబ్బు. ఇవ్వకపోతే సత్యనారాయణ అని పిలవకండి నన్ను' అన్నాడు.

నాకు కళ్లు తిరిగినట్టయ్యాయి. 'ఒక గ్లాసుడు మంచినీళ్లు ఇస్తావా?' అన్నాను దగ్గర్లోనే కనపడ్డ ఒక సెర్వరుతో. 'షణ్ముగం, పంతులు గారికి ఒక కాఫీ! స్పెషల్!' అని కేకెట్టాడు సత్తెయ్య. కళ్లు మూసుకునే, ఒద్దన్నట్టు చెయ్యూపాను. వెన్నకాచిన నెయ్యి జ్ఞాపకం వచ్చింది కాఫీ పేరెత్తగానే.

తర్వాత సత్తెయ్యకి కనబడ్డం మానేశాను. సత్తెయ్య కూడా కలలో తప్ప కనబడలేదు—చాల కాలం వరకు. ఒకరోజున హఠాత్తుగా కనపడ్డాడు రోడ్డుమీద. కలలో కాదు, నిజంగానే. 'పంతులుగారూ! బొత్తిగా కనపడ్డం మానేశారేం?' అన్నాడు. 'ఏం లేదు. వూరికేనే. జబ్బుగా ఉంది. పరీక్షలొస్తున్నాయ్. పనుంది. వూరెళ్లాను' అన్నాను. 'కాఫీతాగొద్దాం, రండి' అన్నాడు. 'వద్దు' అన్నాను. వద్దు అంటూండగానే పక్క సందులోఉన్న పాతహోటలుకి తీసుకెళ్లాడు. కబుర్లు చెప్పటం ప్రారంభించాడు. పంచదారలో కాఫీ పరధ్యానంగా కలుపుకుంటూ చెప్పాడు. అసలు కాలేజీఆవరణ వెలుపల మీటింగు ఏర్పాటుచేయించింది తనేనుట! ఐదారుగురు స్టూడెంట్సు

లంచమిచ్చి, వాదోపవాదాలు రేపాడుట. తనకు మెతకు తక్కువ అని చేసిన తీర్మానం కూడా తనే పెట్టించాడుట! అందువల్ల బిజినెస్ బాగా పెరిగింతన్నాడు. 'ఐదారు వందల రూపాయల వరకు అదనంగా సరుకు ఖర్చైంది' అన్నాడు.

నేను కోపంగా మొహంపెట్టి, కళ్లెర్రచేసి చూద్దామని ప్రయత్నించాను. కాని—కాఫీ తాగుతూండడంవల్ల వీల్లేకపోయింది. సత్తెయ్యకూడా గమనించినట్టున్నాడు: 'ఏం చేయడం పంతులుగారు? కూటికోసం కోటివేషాలు!' అన్నాడు. నేను కాఫీగ్లాసు కిందపెట్టి, వికటాట్టహాసం చేశాను. 'వేషాలు? వేషాలుటోయ్! హుం! మోసాలు!' అన్నాను. 'పోనీ మోసాలే అనండి పోనీ' అన్నాడు సత్తెయ్య.

సత్తెయ్య సిద్ధాంతం- ప్రకారం అబద్ధం చెప్పకుండా, మోసం చెయ్యకుండా గడవదుట ఈకాలంలో. అబద్ధం అందలం ఎక్కింది ఈ శతాబ్దంలో అన్నాడు. 'శ్రీ 420 సినిమా వస్తే లక్షలాదిమంది వెళ్ళి చూసొచ్చారు. శ్రీసీతారామ కళ్యాణం వస్తే, ఎంతమంది చూశారు-చెప్పండి!' అన్నాడు. 'ధర్మరాజు ఒక్కగాను ఒక్క అబద్ధం చెప్పి, ఒక యుద్ధంలో నెగ్గాడు అంతకుముందు సవాలక్ష నిజాలు చెప్పాడు. ఆనిజాలన్నీ ఏమయ్యాయ్? అబద్ధం మిగిలింది మనకి' అన్నాడు, పరధ్యానంగా బిల్లు బల్లకిందకి పడేస్తూ.

''నువ్వు నూరు చెప్పు,వెయ్యిచెప్పు సత్తెయ్యా! లక్షసార్లు కాఫీ ఇప్పించు పూరికే కావలిస్తే! నేను మాత్రం మోసం చెయ్యందే కూడా గడవదంటే నమ్మను'' అన్నాను గద్గదస్వరంతో. నాకు గద్గదస్వరం మామూలుగా రాదు. ఆమధ్య సినీమాలో ఎవరో ఉపయోగిస్తుంటే చూశాను. అప్పట్నించి నేనూ ప్రారంభించాను. అలవాటైతే ఏదైనా బాగానే వస్తుంది.

సత్తెయ్యలో మాత్రం కదలిక లేదు. ''వేషం లేకుండా, మోసం లేకుండా కూడు గడవడం అసాధ్యం, పంతులుగారూ!'' అన్నాడు. ''ఒక కొత్త బిజినెస్ పెడదామనుకుంటున్నాను. మీ సహాయం కావాలి అందులో. ఇంతో అంతో ముట్టచెబుతాలెండి'' అన్నాడు.

అప్పటికీ ఇప్పటికీ సత్తెయ్య మళ్ళీ కనబడ బడలేదు. ఆమధ్య ఎవరో తెలుగువాడే సినీమాలో చేర్పిస్తానని చెప్పి మరో తెలుగువాణ్ణి బొంబాయి తీసుకెళ్ళాడట. ఆరెండో తెలుగువాడి డబ్బుతో తను ఫస్టుక్లాసు టికెట్టు కొనుక్కొని, అతన్ని థర్డుక్లాసులో కూచోపెట్టాడట. టికెట్ కలెక్టరు వచ్చి అడిగితే, అతనెవరో తెలియదు పొమ్మన్నాడట. ఆరెండో తెలుగువాడు శ్రీకృష్ణజన్మస్థానం దర్శించవలసివచ్చిందట. పోలికలను బట్టి చూస్తే,ఫస్టుక్లాసు తెలుగువాడు సత్తెయ్యలాగే ఉన్నాడు ఇంకో పెద్దమనిషికట్ హేంగరూ, సిగరెట్ లైటరూ బహుమతిగా ఇస్తానని ప్రకటించి, ఒక మేకు, మరో అగ్గిపుల్ల పంపించాడట. గుణం సత్తెయ్య గుణమే.

ఇటీవల జపాన్‌నుంచి ఒక కథ వచ్చింది. కుక్కలచేత కరిపించుకోడమే వృత్తిగా పెట్టుకున్నాడట ఒక జపానీయుడు. కుక్కకి కాలు అందివ్వడం, ఆసుపత్రికి పరుగెత్తడం, కట్టు కట్టించుకొని సర్టిఫికేటు తీసుకోడం, కుక్క యజమానివద్ద కుక్కకి ముప్ఫై రూపాయల చొప్పున వసూలుచెయ్యడం ప్రారంభించాడు. రెండు-డజన్ల కుక్కల తర్వాత, అతన్ని పోలీసులు పట్టుకున్నారట. పూర్వజన్మలో అతనిపేరు సత్తెయ్యేమో తెలియదు. ఏమో ఎవరు చెప్పగలరు? కూటికోసంకోటివేషాలు,కాదు,కోటిమోసాలుకదా!

## వెలుగు నీడలు

అన్నపూర్ణా పిక్చర్సువారు తమ 6 వ చిత్రానికి 'వెలుగు నీడలు' అని పేరు పెట్టారు. జనవరి 12 న సంక్రాంతినాడు ఇది ఆంధ్రలో విడుదల అవుతున్నది. ఇందులో నాగేశ్వరరావు, సావిత్రి, జగ్గయ్య, రేలంగి, ఎస్. వి. రంగారావు, గిరిజ, సూర్యకాంతం, సంధ్య ముఖ్యపాత్రలను నిర్వహించారు. దర్శకుడు శ్రీ ఆదుర్తి సుబ్బారావు. సంగీతం శ్రీ పెండ్యాల. మాటలు శ్రీ ఆత్రేయ. పాటలు శ్రీ శ్రీ.నిర్మాత శ్రీ డి.మధుసూదనరావు.

దీని తమిళ భాషాచిత్రానికి ఇంకా పేరు పెట్టలేదు. మద్రాసు మవుంట్‌రోడ్డులో సుమారు 15 లక్షల రూపాయలతో నిర్మించిన 'శాంతి' అనే అత్యంత అధునాతన థియేటరు ప్రారంభోత్సవం ఈ తమిళ చిత్రంతో జరుగనున్నది దక్షిణభారతదేశంలోకల్లా ఇది గొప్ప థియేటరు


# పాలు పొంగిపోకుండా అపుటకు



## పిరమిడ్ గ్లిసరీన్

కొద్దిగా పిరమిడ్ గ్లిసరీన్ పాలకాగు చుట్టూ లోపలగపు అంచునకు రుద్దండి, ఇంక పాలు కాగబెట్టండి, అవి పొంగిపోవు. అవి కాగుచుండగా మీరు తదితరపనులు చక్కబెట్టుకో వచ్చును.

శుద్ధమైన, ఆరోగ్యకరమగు పిరమిడ్ గ్లిసరీన్ ఔషధరీత్యాను, సౌందర్యకారిగాను, కాలమార్పు నిమిత్తమున్ను, ఇంట్లో అనేక విధములుగాను ఉపయుక్తమైనది, ఒకసీసా దగ్గిరుంచుకోండి!




ఉచిత కరపత్రము! ఈ కూపన్ పూరించి హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్ పోస్టుబాక్సు నం. 409, బొంబాయి 1. కు పోస్టుద్వారా పంపండి పిరమిడ్ గ్లిసరీన్ ఇంట్లో వుపయోగించే విధమును తెలిపే ఆంగ్లేయ/హింది • భాషలోగల ఉచితకరపత్రమును దయచేసి నాకు పంపండి.

నాపేరు, చిరునామా __________

అక్కర్లేని భాషను కొట్టివేయండి

హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి

PG. 15-X40 TL